క్లుప్తంగా

'పర్యావరణ పరిరక్షణలో పాత్రికేయుల భాగస్వామ్యం'

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఏయూలో అమెరికన్ కార్నర్‌లో హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ వ్యూస్ ఎంపవరింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సేవలకు ప్రజల మద్దతును పెంచడానికి పాత్రికేయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఓషినోగ్రఫీ ప్రొఫెసర్ ఒ.ఎస్.ఆర్.యూ.భానుకుమార్ మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వనరుల్లో పెట్టుబడులు పెట్టడం, అడవులు పెంపకం వాతావరణాన్ని రక్షించడానికి ప్రధాన సాధనాలన్నారు. బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ, వ్యూస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెల్విన్ బీమారావు, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీలో అన్నదానం

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో షిర్డీసాయి మందిరంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గురువారం దాతల సహాయంతో విధిగా 100 మంది అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సాయంత్రం వేళ సాయినాథుడి పల్లకి ఊరేగింపు కోలాటం సందడి నడుమ ఘనంగా జరిగింది.

జోన్-3లో సమస్యలు లేకుండా చర్యలు



సూచనలిస్తున్న టౌన్ ప్లానింగ్ డీసీపీ నరేంద్రనాథ్‌రెడ్డి

సీతమ్మధార: నగరంలోని అనధికార భవనాల తోపాటు గోడలపై పోస్టర్లు అతికించకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ డీసీపీ నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో గురువారం ఆశీలమెట్టలోని జోన్-3 కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్-3 పరిధిలో సమస్యలు లేకుండా చూడాలని, రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలను రహదారులపై వేయకుండా చర్యలు చేపట్టాలని వార్డు ప్రణాళిక కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సునీత, ఏసీపీ శాస్త్రి సభవన్, టీపీవో తేజ, అనిత, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు, పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీ హోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, సురేష్, సుబ్రహ్మణ్యం, సత్యరూపవాణి, మారుతీ ప్రసాద్, వెంకట రామకృష్ణ, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీలో ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతం!

- ఎక్కడికక్కడ బడ్డీల ఏర్పాటు
- రాకపోకలకు పాదచారుల అవస్థలు



ఎంవీపీ డబుల్ రోడ్డు ఫుట్‌పాత్‌పై అనధికారిక దుకాణాలు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో ఫుట్‌పాత్‌లు పెద్ద ఎత్తున అన్యాక్రాంతమవుతున్నాయి. పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాదచారుల సౌకర్యార్థం రహదారులకు ఇరువైపులా జీవీఎంసీ గతంలో సర్వాంగ సుందరంగా ఫుట్‌పాత్‌లను నిర్మించింది. అయితే ఆయా ప్రధాన రోడ్లలో ఎక్కడా ప్రస్తుతం పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పోయింది. కొందరు వ్యాపారులు పెద్ద ఎత్తున షాపులు పెట్టి ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించేశారు. టిఫిన్ షాపులు, కొబ్బరికాయల విక్రయాలు, టీ స్టాళ్లు, జ్యూస్ షాపులు అడ్డూ అదుపూ లేకుండా నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీలో ఈ తరహా ఫుట్‌పాత్ వ్యాపారం ప్రస్తుతం జోరుగా సాగుతోంది. ప్రతిరోజు ఏదో ఒక చోట ఫుట్‌పాత్‌లపై కొత్త బడ్డీలు పుట్టుకొస్తూనే ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాలనీలోని ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా షాపులు పుట్టుకొస్తున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏఎస్ రాజా మైదానం, టీటీడీ కూడళ్లలో గత ఆరు నెలల్లో పదుల సంఖ్యలో ఫుట్‌పాత్‌పై బడ్డీలు వెలిశాయి. స్థానికుల ఫిర్యాదుతో గతంలో ఫుట్‌పాత్‌లపై బడ్డీలను తక్షణమే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ జోన్-3 టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన షాపులను పరిశీలిస్తాం. కొందరు రకరకాల కారణాలు చెప్పి రాత్రి పూట షాపులు ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై ఆరా తీసి చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఐఐఏఎం ఎదుట ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీని మా సిబ్బంది తొలగించారు. కల్యాణి మెస్ దరి ఫుట్‌పాత్‌పై కూడా బడ్డీ ఏర్పాటు చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. త్వరలోనే దానిపై చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి బడ్డీలు, షాపులు పెట్టినా తొలగిస్తాం.

– శాస్త్రి, ఏసీపీ టౌన్‌ప్లానింగ్, జోన్-3

సమస్యల పరిష్కారానికి కృషి

- మేయర్ హరివెంకటకుమారి
- 11వ వార్డులో రూ 1.65 కోట్లతో అభివృద్ధి పనులు



ముస్తఫా కాలనీలో ముస్లింల సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మేయర్

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో ప్రజలు సూచించిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని మేయర్ గొలగాని హరివెంకటకుమారి హామీ ఇచ్చారు. 11వ వార్డులో గురువారం పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.65 కోట్ల జీవీఎంసీ నిధులతో బాలాజీనగర్, పాత ఆరిలోవ నుంచి ఆరిలోవ ఆస్పత్రి రోడ్డు, ముస్తఫాకాలనీలో రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు ముస్తఫాకాలనీలో ముస్లింల సామాజిక భవనం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు భూమి పూజ అనంతరం మేయర్ మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మరికొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. బాలాజీనగర్ నుంచి విఘ్నేశ్వర ఆలయం వరకు రూ.30 లక్షలు, జీవీఎంసీ ఆస్పత్రి రోడ్డు రూ.35 లక్షలు, ముస్తఫా కాలనీలో వీధి రోడ్లు రూ.45 లక్షలతో పాటు ముస్తఫా కాలనీలో ముస్లింల సామాజిక భవనం రూ.55 లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 11వ వార్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో అభివృద్ధి పనులు చురుగ్గా చేపట్టగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, మూర్తి, జహింగీర్, బాషా, మక్బుల్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి తోటగరువు హైస్కూల్ విద్యార్థులు





కాశీ శ్రావణ్   సాయి ఈశ్వర్   మౌనిక ప్రియా

ఆరిలోవ: తోటగరువు హైస్కూల్లో చదువుకున్న ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కాశీ శ్రావణ్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, చదువుల సాయిఈశ్వర్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ, ఎగిరెడ్డి మౌనిక ప్రియా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం



మాట్లాడుతున్న శోభ శ్రీ

బీచ్ రోడ్డు: విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు విలువలతో కూడిన బోధనే ఉపాధ్యాయుల ప్రథమ లక్ష్యం కావాలని ఐఏఎస్ఐ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అన్నారు. ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానంలో ఎన్నో వినూత్న మార్పులు తీసుకువచ్చాయన్నారు. యూజీ అండ్ పీజీ పాఠ్యాంశాలలో అకడమిక్ కెరీయర్‌కు సంబంధించిన కొత్త కరికులం రూపొందించారని చెప్పారు. ఈ నూతన విద్యా విధానంను అనుసరించి అధ్యాపకులు మరిన్ని నైపుణ్యాలను సంపాదించి విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలన్నారు. మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ ఆచార్య టి.వెంకటకృష్ణ మాట్లాడుతూ 28 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ డిగ్రీ కాలేజీల అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య ఎస్ ఏడీ పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో ఇరుక్కుపోయిన లారీ



పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఇరుకు రోడ్డులో లారీ

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలో ఓ లారీ ఇరుకు రోడ్డులో ఇరుక్కుపోయింది. ఇక్కడి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసాల మధ్య చిన్నరోడ్లు ఉన్నాయి. ఆ రోడ్లలోకి గురువారం ఓ సిమెంట్ లారీ ప్రవేశించింది. భారీ వాహనం కావడంతో ఆ రోడ్డులో ఇరుక్కుపోయింది. ఎటు తిరిగినా ఏదో ఒక ఇంటి గోడకు, రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి తగులుతుండేది. దాన్ని ముందు, వెనుకకు మళ్లించే క్రమంలో ఓ ఇంటి గోడకు తగిలి పగిలిపోయింది. పక్కనే ఓ విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ఆ స్తంభం వైర్లు తెగిపోవడంతో కాలనీలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ లారీ తిరిగి ఆ రోడ్డు నుంచి బయట పడడానికి డ్రైవర్ నానా తంటాలు పడాల్సి వచ్చింది. భారీ వాహనాలు ఇరుకు రోడ్లలోకి ప్రవేశించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్మార్ట్ బస్ బే పరిశీలన



గురుద్వారా జంక్షన్ బస్ బేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ గురుద్వారా జంక్షన్ వద్ద రూ.36 లక్షలతో కొత్తగా నిర్మించిన బస్ బేను గురువారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పేరొందిన విశాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని, స్మార్ట్ సిటీకి తగ్గట్టు బస్ షెల్టర్లను కూడా ఆధునికంగా తీర్చిదిద్దారన్నారు. త్వరలో ప్రముఖుల చేతుల మీదుగా బస్ బే ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ శ్రీరామమూర్తి, వార్డు ప్లానింగ్ సెక్రటరీ వెంకటరమణ, ఎమినిటీస్ సెక్రటరీ రామకృష్ణ, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, ఉప్పిలి అప్పన్న, భోగవిల్లి కొండలరావు, గుడివాడ గౌరినాయుడు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే సమాజ ప్రగతి

డాబాగార్డెన్స్: సైన్స్ ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ జగదీష్ పేర్కొన్నారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో గురువారం స్టోరీ ఆఫ్ ఎవ్రీథింగ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దృక్పథం, ఖగోళ శాస్త్రం, జీవ పరిణామం, భూ విజ్ఞాన శాస్త్రం, మానసిక శాస్త్రంలో పలు అంశాలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ పలు శాస్త్రాలపై రెండు రోజుల పాటు సెమినార్ తమ కళాశాలలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా జగదీష్‌ను సత్కరించారు.

అప్పన్నకు ఘనంగా ఏకాదశి ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్టింపజేసి ఉభయ దాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, తదితరులు ఈ సేవ నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి, విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 5వ జోన్ పరిధి జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 14న కాన్వెంట్ జంక్షన్ వద్ద గల ఐవోసీఎల్ పెట్రోల్ బంక్ స్థలం వేలం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, పూర్తి సమాచారం కోసం జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకులను పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

మేడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

సీతమ్మధార: మేడపై నుంచి పడిన ఓ మహిళ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని గ్రూప్ హౌస్‌లో నివసిస్తున్న సూర్యచంద్ర, హారికకు 2013లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఒక ప్రైవేట్ కంపెనీని డీలర్ షిప్‌తో నడుపుతున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. ఈ సమయంలో హారిక మేడపై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు డయల్ 100కు కాల్‌చేసి సమాచారమిచ్చారు. ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హారిక తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భర్త సూర్యచంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భర్త మేడపై నుంచి భార్యను తోసేశాడా.. లేక ఇంకా ఏమైనా జరిగిందా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు



చికిత్స పొందుతున్న కిరణ్‌కుమార్

ఉక్కునగరం: నిత్యం పాములతో ఆడుకునే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు పాము కాటు తప్పలేదు. పెద్ద కోబ్రాలను, విష పాములను పట్టుకున్న ఆయన పాము పిల్లను పట్టు కునే ప్రయత్నంలో కాటుకు గురయ్యాడు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగంలో ఐదు రోజుల క్రితం పెద్ద నాగుపామును పట్టుకున్న కిరణ్ కుమార్ బుధవారం అదే విభాగంలో ఉన్న 18 నాగుపాము పిల్లలను పట్టుకున్నారు. కిరణ్ సేవలను ప్రశంసిస్తూ విజిలెన్స్ విభాగం గురువారం ఉదయం ఆయన్ను సత్కరించింది. జీఎం వేణు ప్రశంసాపత్రం అందజేశారు. కొద్దిసేపటికి మరో పాము పిల్ల ఉన్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ విభాగానికి వెళ్లారు. దానిని పట్టుకునే ప్రయత్నంలో అప్పటికే కోరలు తెరిచి ఉన్న పాముపిల్ల కిరణ్‌కుమార్ చేతి ఉంగరం వేలుపై కాటు వేసింది. వెంటనే ఆయన అగనంపూడి ఆసుపత్రికి, అనంతరం కేజీహెచ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు.

వలంటీర్లకు వందనం

కోవిడ్ సమయంలో అండగా..



ఏయూ క్యాంపస్: కోవిడ్ విపత్తు సమయంలో వార్డులో అనేక కుటుంబాలకు అండగా నిలిచే అవకాశం లభించింది. కొంత మంది వృద్ధులు కోవిడ్ బారిన పడి తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. సకాలంలో స్పందించి వారిని ఆస్పత్రిలో చేర్పించి, తగిన చికిత్స అందించడంతో తిరిగి కోలుకున్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం, పెన్షన్ వంటివి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇవ్వడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. అటువంటి వలంటీర్ల వ్యవస్థపై దుష్ప్రచారం చేయడం దారుణం.

– ఎనమరెడ్డి కుమార్‌రెడ్డి, వలంటీర్, 20వ వార్డు

నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు..



వార్డు వలంటీర్ చేస్తున్న సేవలు నిరుపమానం. మాకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు. ఫోన్ చేయగానే అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయడంలో వారధిగా నిలుస్తున్నారు. వితంతు పెన్షన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు మంజూరులో మా వలంటీర్ కృషి ఎంతో ఉంది.

– అంగ సుభాషిణి, కాగితాల వారి వీధి, పెదవాల్తేరు

సేవకు నిదర్శనం



సరస్వతికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ హిందు (ఫైల్)

ఎంవీపీ కాలనీ: నిజమైన ప్రజా సేవకు వలంటీర్లు నిలువుటద్దంగా నిలుస్తున్న సందర్భాలు ఎన్నో. ప్రజా సంక్షేమాన్ని ఇంటింటికి చేర్చడమే కాదు.. ఆపదలో ఉన్న పెన్షనర్ల కన్నీరు తుడిచేందుకు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి వారికి అండగా నిలిచిన ఘటనలూ ఎక్కువే. జీవీఎంసీ 18వ వార్డు వలంటీర్ హిందు కూడా ఇలాంటి సేవకు నిదర్శనంగా నిలిచింది. 18వ వార్డు మూలపాలెం ప్రాంతానికి చెందిన కుదన సరస్వతి తన కుమారుడిని చూసేందుకు శ్రీకాకుళం వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురైంది. స్థానికులు ఆమెను శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పగా తీవ్రగాయాలు కారణంగా చాలా రోజులు అక్కడే చికిత్స చేయించుకోవాల్సివచ్చింది. ఆమె దయనీయ పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ హిందు తన సొంత ఖర్చులతో శ్రీకాకుళం వెళ్లి మరీ సరస్వతికి పెన్షన్ డబ్బులు అందజేసింది. ఆ సేవలను నేటికి గుర్తు చేసుకుంటూ లబ్ధిదారు సరస్వతి కృతజ్ఞతలు తెలుపుతోంది.

కొమర్రాజు రచనలు స్ఫూర్తిదాయకం



కొమర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏయూ తెలుగు శాఖాధిపతులు

ఆరిలోవ: తెలుగు భాషా సాహిత్యవేత్త కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శత వర్ధంతి కార్యక్రమం గురువారం ఏయూలో తెలుగు విభాగంలో జరిగింది. ఈ సందర్భంగా కొమర్రాజు చిత్ర పటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొమర్రాజు మనవుడు, ఏయూ రాజనీతి శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు కొమర్రాజు రవి మాట్లాడుతూ భాష, సాహిత్యం తదితర వాటి చరిత్ర పరిశోధనలకు మాత్రమే కొమర్రాజు వెంకటలక్ష్మణరావు పరిమితం కాలేదన్నారు. ఆయన స్త్రీ విద్య కోసం కూడా పాటుపడ్డారని గుర్తు చేశారు. అప్పటి సమాజంలో స్త్రీలు అందరూ చదువుకోవాలని వెంకటలక్ష్మణరావు ఆకాంక్షించారన్నారు. దీంతో పాటు నిమ్న, బడుగు, అట్టడుగు వర్గాల ప్రజలు, వితంతువులు అభ్యున్నతి కోసం రచనలు చేశారన్నారు. బీవీకే కళాశాల తెలుగు విశ్రాంత ఆచార్యుడు దామెర వెంకట సూర్యారావు మాట్లాడుతూ కొమర్రాజు చిన్నప్పటి నుంచే సమాజం పోకడలను గుర్తించారన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని మేల్కొలిపే రచనలు చేశారని కొనియాడారు. ముసలి మొగుడు, పడుచు పెళ్లాం, తదితర కథలు రాసి సమాజాన్ని జాగృతిపరిచారన్నారు. కొమర్రాజు జీవితాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్, తెలుగు ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై యథేచ్ఛగా బడ్డీల ఏర్పాటు



డెయిరీ ఫారం వద్ద ఎలక్ట్రికల్ మిషన్‌తో బడ్డీ తలుపులు కట్ చేస్తున్న సచివాలయం సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో రోడ్లపై యథేచ్ఛగా బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. వార్డులో కొందరు రాజకీయ నాయకులు రోడ్లకు ఇరువైపులా బడ్డీలు ఏర్పాటు చేసి కొందరు అద్దెకు ఇవ్వగా, ఇంకొందరు విక్రయించేస్తున్నారు. బడ్డీల ఏర్పాటుతో రోడ్లు ఇరుకుమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. వీటిపై జీవీఎంసీ అధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మేరకు అధికారుల ఆదేశాలతో గురువారం వార్డులో సచివాలయాల సిబ్బంది డెయిరీ ఫారం వద్ద పశుసంవర్ధక శాఖ జిల్లా శిక్షణ కార్యాలయం ఎదురుగా ఇటీవల ఓ రాజకీయ నాయకుడు ఏర్పాటు చేసి టైలరింగ్ షాపు కోసం అద్దెకు ఇచ్చిన బడ్డీని తొలగించే ప్రయత్నం చేశారు. కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడితో ఆ పని పూర్తి చేయలేకపోయారు. ఎలక్ట్రికల్ మిషన్‌తో బడ్డీ తలుపులు కట్ చేసి వదిలేశారు. దీనికి ఎదురుగా మరికొందరు ఏర్పాటు చేసిన బడ్డీలను కూడా సచివాలయం, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఇటీవల తొలగించే ప్రయత్నం చేశారు. వాటిపై కూడా రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో వదిలేశారు. రోడ్డుపై ఇటీవల అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సులు చెల్లించాలి

- ఈడీ వర్క్స్ బిల్డింగ్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను గతంలో వలే చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద గురువారం ధర్నా చేశారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అలవెన్సులపై ఈఎస్ఐ చెల్లించాలన్న ఈఎస్ఐ అధికారుల ఆదేశాలతో, కాంట్రాక్టర్లు కార్మికులకు అలవెన్సులను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశం యాజమాన్యంతో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే పూర్వ పద్ధతిలో అలవెన్సులు చెల్లించాలని కోరారు. అనంతరం హెచ్ఆర్ జీఎం బినయ్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, కొవిరి అవతారం, ఉమ్మిడి అప్పారావు, పిట్టా రెడ్డి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.